సాక్షి
పల్నాడు
శుక్రవారం ౹ 5 ౹ జూలై ౹ 2024



అల్లూరికి నివాళి

చిలకలూరిపేట: ఎన్ఆర్‌టీ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గురువారం ఆయన జయంత్యుత్సవాన్ని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు.



విత్తన దుకాణాల తనిఖీ

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని విత్తన దుకాణాలు, గ్రోమోరు సెంటర్‌ను గురువారం ఏఓ వాసంతి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 503.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలికాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు జరుగుతాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2008 జనవరి నుంచి 2010 డిసెంబర్ మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. పాల్గొనే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్ ఫొటోలతోపాటు తల్లిదండ్రుల సమ్మతి పత్రం వెంట తీసుకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 97010 52588 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌పై వైఎస్సార్ పేరుకు పసుపురంగు



అచ్చంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.కోట్లాది రూపాయలతో గ్రామగ్రామాన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలను చేరువ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ క్లినిక్‌లకు వైఎస్సార్ పేరు ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయిన టీడీపీ నాయకులు చామవరం గ్రామంలోని క్లినిక్ వద్ద బోర్డుపై ఉన్న వైఎస్సార్ పేరుపై బుధవారం రాత్రి పసుపు రంగు పూశారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా స్థానిక వైద్యసిబ్బందికీ తెలియకుండా ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఆరోగ్యశ్రీ, 108 వంటి మహోన్నత పథకాలను ప్రవేశపెట్టిన తమ ఆరాధ్య నాయకుడు వైఎస్సార్ పేరుపై పసుపురంగు పూయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యార్డులో 33,108 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,108 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,500 నుంచి రూ.19,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,419 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వర్సిటీలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఏఎన్‌యూ : అసమర్థ జాతీయ స్థాయి పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహించిన బంద్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సంపూర్ణంగా జరిగింది. తరగతులు జరగకుండా నాయకులు పర్యవేక్షించారు.

జాతీయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2024కు అర్హుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈనెల 15లోపు సమర్పించాలని సూచించారు.

సమాచార సెల్‌యేరులు

అరచేతిలో సేద్య సూచనలు

- సెల్‌ఫోన్ యాప్‌లతో సమగ్ర సమాచారం
- వాతావరణం తెలుసుకునే వెసులుబాటు
- మేలురక సలహాలూ అందుబాటులో..

దాచేపల్లి : సేద్య రంగం సాంకేతికతను అందిపుచ్చుకుంటుంది. రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు సరికొత్త యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. సమగ్ర సమాచారాన్ని అరచేతిలో నిక్షిప్తం చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులతోపాటు కొత్తకొత్త యాజమాన్య పద్ధతుల గురించిన సమాచారాన్ని కర్షకులకు అందిస్తున్నాయి. కొన్నేళ్లక్రితం రైతులు వర్షపాత పరిస్థితులు తెలుసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. ప్రస్తుతం ఆధునిక యాప్‌ల ద్వారా వారం రోజుల ముందే వాతావరణ సమాచారంతోపాటు చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యల గురించి సూచనలు తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రైతులకు ఉపయోగపడే కొన్ని యాప్‌ల గురించి సంక్షిప్తంగా..



పిడికిట్లో పిడుగుల సమాచారం



ఎప్పటికప్పుడు పిడుగుల గురించి సమాచారం అందించే యాప్ వజ్రదూత్. స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ ద్వారా దీనిని డౌన్‌లోడ్ చేసుకోచ్చు. యాప్‌పై నొక్కితే రెండు రకాల సమాచారాలు అందుబాటులోకి వస్తాయి. ఎడమవైపు నొక్కితే పిడుగులు పడే సమాచారం కనిపిస్తుంది. మనం ఉండే ప్రాంతంతో సహా పూర్తి మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్ వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలు ఉంటాయి. ఈ అంకెల మేరకు ఎంత దూరంలో పిడుగుపడే అవకాశం ఉందో గుర్తించవచ్చు. యాప్ కుడిభాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది.

ఆగ'మేఘా'లపై సూచనలు



మేఘదూత్ యాప్ సమగ్ర వాతావరణ సమాచారాన్ని తెలియజేస్తుంది. విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం వరకు అన్నదాతలకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వారం రోజులు ముందుగానే వాతావరణంలో మార్పులు, వర్షపు సూచనలతో సహా గాలుల దిశలను సైతం తెలియజేస్తుంది. వాతావరణంలో తేమశాతం, ఉష్ణోగ్రతల వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతోపాటు నీటియాజమాన్యం, రైతులు ఏయే పంటలకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో కూడా యాప్ వివరిస్తుంది.

రెయిన్ అలారం



రెయిన్ అలారం యాప్‌ని గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా మనం ఉంటున్న ప్రాంతానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం కురిసే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. వర్షం వల్ల సంభవించే భారీ ముప్పులను ముందుగానే తెలుసుకుని జాగ్రత్త పడవచ్చు.

రైతులకు మేలు



వ్యవసాయానికి ఉపయోగపడేలా యాప్‌లు సెల్‌ఫోన్‌లో అందుబాటులో ఉన్నాయి. పంటలకు తెగుళ్లు వస్తే ఎలా నివారించాలో సెల్‌ఫోన్‌లోనే తెలుసుకోవచ్చు. వర్షాలు, తుఫాన్లు, పిడుగులు పడే సమాచారాన్ని ముందస్తుగానే తెలుసుకునే వెసులుబాటు ఉంది. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి రైతు ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని సూచనలు పొందొచ్చు.

– ఎనిబెర మోహన్, ఉద్యానవనశాఖ అధికారి, గురజాల

పరగటిచర్లలో నూరుశాతం పింఛన్ల పంపిణీ

- మాజీ ఎంపీపీ చిగురుపాటి ఆదినారాయణ జీవించే ఉన్నారు
- ఆయనపై దుష్ప్రచారానికి ఐదుగురు వ్యక్తులు అధికారులను తప్పుదోవ పట్టించారు
- తెలుగుదేశం నాయకుల స్పష్టీకరణ



కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నరసరావుపేట: రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామంలో నూరు శాతం పింఛన్ పంపిణీ పూర్తయిందని తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుడు కామినేని వెంకటరంగారావు స్పష్టం చేశారు. నరసరావుపేట కలెక్టరేట్ వద్ద గురువారం గ్రామ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పరగటిచర్ల గ్రామంలో వీరయ్య అనే వ్యక్తి ఆర్థిక కారణాలతో ఊరు విడిచి వెళ్లారని, అతనికి తప్పించి మిగతా వారందరికీ పింఛన్లు అందాయని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కామినేని రామారావు, ఏడుకొండలు, అప్పారావు, కామినేని వెంకయ్య, సిద్దాబత్తుని జానకి అనే ఐదుగురు వ్యక్తులు కావాలని మాజీ ఎంపీపీ చిగురుపాటి ఆదినారాయణ ఇంటి వద్దకు వస్తేనే పింఛన్ ఇస్తారని తప్పుడు ప్రచారం చేసి అధికారులను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చామని వివరించారు. చిగురుపాటి ఆదినారాయణ ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి టీడీపీలో కొనసాగుతూ గ్రామాభివృద్ధికి కృషి చేశారని వెల్లడించారు. ఆయన ఆరోగ్యంగా జీవించే ఉన్నారని స్పష్టం చేశారు. గతంలో వెంకయ్య, ఏడుకొండలు అనే వారు గ్రామంలోని వికలాంగులతోపాటు 15 మందికి పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. తాము పారదర్శకంగా పింఛన్ల పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో కందుల శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు పాల్గొన్నారు.

రోశయ్య, వంగవీటి రంగా ప్రజా నాయకులు



మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, వంగవీటి మోహన్ రంగా ప్రజా నాయకులు అని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కొనియాడారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కొణిజేటి రోశయ్య, వంగవీటి మోహన్ రంగా జయంత్యుత్సవం సందర్భంగా వారి చిత్ర పటాలతోపాటు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రోశయ్య, రంగా జీవితాలు ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్, డేగల యోహాన్, చల్లగుండ్ల స్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లోని వంగవీటి రంగా బొమ్మ వద్ద రంగా జయంత్యుత్సవం నిర్వహించారు. 1,000 మందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూతి నారాయణ, కొమ్మా మహేష్, నూతి సూరి, దేవినేని మోహన్‌రావు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు ఏపీ టెట్ ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: మైనార్టీల ప్రాంతీయ విద్యాభివృద్ధి కేంద్ర (ఆర్సీఈడీఎం) ఆధ్వర్యంలో ఏపీ టెట్‌కు సన్నద్ధమవుతున్న మైనార్టీ విద్యార్థులకు పొన్నూరురోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ మస్తాన్‌వలి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం, క్రైస్తవ, పార్సీ, సిక్కు, జైన, బౌద్ధ అభ్యర్థులకు ఉర్దూ, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉచిత శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి జరగనున్న ఉచిత శిక్షణ కోసం టెట్–2024 ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం జిరాక్స్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఆంధ్ర ముస్లిం కళాశాలలో లేదా 90308 72696, 94414 53256, 81259 07579 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆత్మహత్య చేసుకోబోయిన మహిళ

- కాపాడిన పోలీసులు
- సెల్‌ఫోన్ ఆధారంగా రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తింపు
- హుటాహుటిన వెళ్లి సురక్షితంగా కుమార్తెకు అప్పగింత



నిర్మలను సురక్షితంగా కుమార్తెకు అప్పగిస్తున్న పోలీస్ సిబ్బంది

నరసరావుపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధమైన మహిళను పల్నాడు జిల్లా పోలీసులు కాపాడారు. కుమార్తె ఇచ్చిన సమాచారంతో సకాలంలో స్పందించిన పోలీసులు ఆమెను కాపాడి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. సత్తెనపల్లి పట్టణానికి చెందిన బొక్కవరపు నిర్మల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ క్రమంలో నరసరావుపేట పట్టణం పెద్దచెరువులో నివాసం ఉండే కుమార్తె వద్దకు రెండు రోజుల క్రితం వచ్చింది. బుధవారం కుమార్తెకు చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళిపోయింది. కుమార్తె ఫోన్ చేయడంతో తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు తల్లి చెప్పింది. దీంతో కుమార్తె టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని సీఐ భాస్కర్‌కు వివరించింది. నిర్మల సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు సీఐ గుర్తించి అక్కడి సీఐ ఆంజనేయులుకు జరిగిన విషయాన్ని తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన పిడుగురాళ్ల సీఐ సిబ్బందిని రైల్వే స్టేషన్‌కు పంపించారు. ఆత్మహత్యకు పాల్పడేందుకు రైలు కోసం ఎదురు చూస్తున్న నిర్మలను రక్షించి సురక్షితంగా కుమార్తెకు అప్పగించారు. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ నరసరావుపేట, పిడుగురాళ్ల సీఐలను అభినందించారు.

అల్లూరి ఆదర్శప్రాయుడు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ లత్కర్



అల్లూరి చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ మలికా గార్గ్

కలెక్టర్ బి.లత్కర్

నరసరావుపేట: అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అల్లూరి జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాటపటిమను కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీటీడబ్ల్యూఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

దేశ స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఎనలేనిదని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి జయంత్యుత్సవం నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అడిషనల్ అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఎస్‌బీ సీఐలు బి.సురేష్‌బాబు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

కట్టుకున్న భర్తే కాలయముడై..

- గొడ్డలితో దాడి
- ఆస్పత్రికి తరలించేలోగా మహిళ మృతి
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

యడ్లపాడు: కట్టుకున్న భర్తే అనుమానంతో భార్యను అంతమొందించాడు. ఈ దుర్ఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు నాగేశ్వరరావు టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య వేదకుమారి (55) పొలం పనులు చేసుకుంటూ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న నాగేశ్వరరావు తరచూ గొడవ పడుతుండేవాడు. ఈనెల 1న నాగేశ్వరరావుకు పెన్షన్ రావడంతో అప్పటి నుంచి మద్యం సేవిస్తున్నాడు. పెద్దకూరపాడులో నివాసం ఉంటున్న కుమార్తె, అల్లుడు తిమ్మాపురంలోని పుట్టింటికి వచ్చారు. వారి ఎదుటే దంపతులు గొడవ పడ్డారు. కుమార్తె, అల్లుడు వెళ్లిపోయిన తరువాత ఇంట్లో ఉన్న భార్య వెనుకగా వచ్చిన నాగేశ్వరరావు గొడ్డలితో ఆమె తలపై మోదాడు. దీంతో కుప్పకూలిపోయిన వేదకుమారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భర్త నాగేశ్వరరావు యడ్లపాడు పోలీసుల వద్ద లొంగిపోయాడు. వేదకుమారి మృతదేహానికి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతిచెందిన వేదకుమారి

రైతు దారుణ హత్య

వెల్దుర్తి: మండలంలోని మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన రైతు గురువారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి వెంకటరెడ్డి (53)ని అదే గ్రామానికి చెందిన ఇద్దరు మద్యం తీసుకురావాలని ఫోన్ చేశారు. వెంకటరెడ్డి మద్యం తీసుకుని గ్రామ శివారులోని రెస్టారెంట్ ఎదురుగా ఉన్న పొలంలోకి వెళ్లాడు. అక్కడ ముగ్గురూ కూర్చుని మద్యం తాగుతుండగా, దుండగులు వెనుక నుంచి వచ్చి గొడ్డలితో వెంకటరెడ్డిని దారుణంగా నరికి హత్య చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీంను పిలిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటరెడ్డి హత్యకు వివాహేతర సంబంధం లేదా ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చునని గ్రామస్తులు, పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం సాక్ష్యాలు సేకరించిన తర్వాత వెంకటరెడ్డి మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. వెంకటరెడ్డి భార్య ఫిర్యాదు మేరకు మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



హత్యకు గురైన పులి వెంకటరెడ్డి

ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అనుమానాస్పద మృతి

దాచేపల్లి : నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దాచేపల్లికి చెందిన గుమ్మడి నాగిరెడ్డి(47) కొన్నేళ్లుగా ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 1వ తేదీ రాత్రి నుంచి నాగిరెడ్డి కనిపించకపోవడంతో ఆయన కుమారుడు లోకేష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగిరెడ్డి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావటంతో ఆయన ఆచూకీ కనిపెట్టటం పోలీసులకు కష్టమైంది. ఈ క్రమంలో దాచేపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి నాగిరెడ్డిదిగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. శరీరం ఉబ్బి పగిలిపోయే స్థితిలో ఉన్నది. నాగిరెడ్డి మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగిరెడ్డి భార్య ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగిరెడ్డిది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. నాగిరెడ్డి వినియోగించిన సెల్‌ఫోన్ డేటా ఆధారంగా విచారణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు

15 వరకు వారాహి నవరాత్రులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి అయిన శనివారం నుంచే వారాహి నవరాత్రులు ప్రారంభించేందుకు దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది. నెల రోజుల ఆషాఢ మాసంలో లోక కల్యాణార్థం జగన్మాత శ్రీదుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆషాఢ మాసం తొలి రోజున ఆలయ అర్చకులు, వేద పండితులు, వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు సారె సమర్పిస్తారు. శనివారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి అలంకరణ, నిత్య పూజల అనంతరం తొలి సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. అదే సమయంలో వారాహి నవరాత్రులను పురస్కరించుకుని కలశ స్థాపన, అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్తులు, ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు, భజన బృందాలు, దేవాలయాల కమిటీలను ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడంతో పాటు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గురువారం ఈవో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

15వ తేదీన పూర్ణాహుతితో ముగింపు

దుర్గమ్మ సన్నిధిలో ఈ ఏడాది తొలిసారిగా వారాహి నవరాత్రులను నిర్వహిస్తున్నారు. 6 నుంచి 15 వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. అమ్మవారికి పంచ వారాహి మంత్రాలు, బృహద్ వారాహి, లఘు వారాహి, స్వప్న వారాహి, ధూమ్ర వారాహి, కిరాత వారాహి, చండీ పారాయణ, రుద్ర పారాయణ మంత్ర హోమాలతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మండప పూజ, హారతి, మంత్రపుష్పం సమర్పిస్తారు. ఆయా పూజలను దేవస్థానం తరఫున ఆలయ అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు. 15వ తేదీ పూర్ణాహుతితో వారాహి నవరాత్రులు ముగుస్తాయి.

ఎన్నారై మృతి కేసులో అత్తను విచారించిన సీఐడీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అమెరికాలో గుంటూరు యువకుడు గంగూరి శ్రీనాథ్ అనుమానాస్పద మృతి కేసులో నిందితురాలు, అత్త సుఖవాసి రాజశ్రీని బుధవారం రాత్రి హైదరాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనయుడు శ్రీనాథ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ తండ్రి బాబురావు గత ఏడాదిలో ఏపీ సీఐడీ అధికారులను ఆశ్రయించారు. రాజశ్రీతో పాటు, మామ సుఖవాసి శ్రీనివాసరావు, శ్రీనాథ్ భార్య సాయిచరణిపై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. కేసు విచారణలో ఉండగా కోర్టుకు, సీఐడీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా కుమార్తె సాయిచరణి వద్దకు రాజశ్రీ అమెరికా వెళ్లారు. దీంతో సీఐడీ లుక్ అవుట్ నోటీసు జారీచేసింది. బుధవారం రాత్రి అమెరికా నుంచి వచ్చిన వెంటనే రాజశ్రీని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆమెను ఏపీ సీఐడీ అధికారులు విచారించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

చిత్తూరు జట్టు ఘన విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలు మూడో మ్యాచ్‌లో చిత్తూరు జిల్లా జట్టు 291 పరుగుల తేడాతో కర్నూలు జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 374, రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులు చేసింది. కాగా, ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 20 పరుగుల స్కోర్‌తో గురువారం మూడో రోజు ఆట ప్రారంభించిన కర్నూలు జట్టు తన ముందున్న 407 పరుగుల భారీ లక్ష్య సాధనలో చతికిలపడింది. 116 పరుగులకే ఆలౌట్ అయింది. కర్నూలు బ్యాట్స్‌మెన్ జి.ఎస్.భరద్వాజ్ 44 పరుగులు సాధించగా, చిత్తూరు బౌలర్లు ఎం.ప్రకాష్, సి.సోహన్‌రెడ్డికి చెరో 3 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రైతులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు



సత్తెనపల్లి: పశుపోషణకు రైతులు మేలైన గడ్డిని దాణాగా ఉపయోగించాలని పశుసంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ పి.రామారావు కోరారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నామని వెల్లడించారు. మేలైన గడ్డి విత్తనాలను నాటడం ద్వారా పలు దఫాలుగా గడ్డి కోసుకోవచ్చునన్నారు. జిల్లాలో 49 టన్నుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, పశు వైద్యశాలల ద్వారా వీటిని పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎన్‌సీహెచ్ నరసింహులు, పెదమక్కెన పశు వైద్యశాల డాక్టర్ శిరీష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గృహ హింసపై కేసు నమోదు

వేమూరు: భర్త గృహ హింసపై ఓ వివాహిత ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన గుర్రం సుధీర్‌బాబు మొదటి భార్య అనారోగ్యంతో చనిపోవడంతో దివ్యను రెండో వివాహం చేసుకున్నాడు. సుధీర్‌బాబుకు ఇద్దరు మగ పిల్లలున్నారు. ఇద్దరినీ దివ్య బాగా చూసుకుంటున్నా కూడా సంతృప్తి చెందేవాడు కాదు. ఆమెపై అనుమానంతో శారీరంగా, మానసికంగా వేధించేవాడు. దీన్ని భరించలేక దివ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.


ప్రైవేట్ పేమెంట్ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు బంద్

- ఏపీసీపీడీసీఎల్ యాప్, లేదా వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలి
- ఈనెల నుంచి ఆర్‌బీఐ కొత్త నిబంధన
- జూలై 1 నుంచే అమలు

సత్తెనపల్లి: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధన ప్రకారం ఏపీ సీపీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా సంస్థ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మాత్రమే బిల్లులు చెల్లించాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసినట్లు వెల్లడించింది. విద్యుత్ శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటుంది. ఇకపై ఇలా చేయడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్‌ల నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ నిబంధన ప్రకారం లైసెన్సులు అవసరం

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీస్ చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే ఈనెల ఒకటి నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్లు పేమెంట్ ఆప్షన్‌ను యాప్‌లు తొలగించేశాయి.



ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్ శాఖ డిస్‌ప్లే చేసిన సమాచారం

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, ఇతరత్రా వాటిలో కరెంట్ బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతుంది. కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమవుతోంది. అదే ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్ చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వెళ్తుంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఏపీ సీపీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న ఏపీ సీపీడీసీఎల్ అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి అనుకుంటే https://apcpdc.in ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఉంది.

80 శాతం ఆన్‌లైన్..

జిల్లాలో దాదాపు 80 శాతం మంది వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. జిల్లాలో గృహ, వాణిజ్య సర్వీసులు 7,48,449, హెచ్‌టీ సర్వీసులు 594 ఉన్నాయి. నెలకు ఎల్‌టీ విద్యుత్ వినియోగం 309.6 మెగా యూనిట్లు కాగా నెలకు హెచ్‌టీ విద్యుత్ వినియోగం 179.17 మెగా యూనిట్లుగా ఉంది. నెలకు ఎల్‌టీ విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.51.12 కోట్లు, నెలకు హెచ్‌టీ విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.87.72 కోట్లుగా ఉంది.

వినియోగదారులు సహకరించాలి

విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు బిల్లులు చెల్లించాలి. ఈనెల ఒకటి నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశాం. విద్యుత్ వినియోగదారులు సహకరించాలి. కరపత్రాల ద్వారా దీనిపై పూర్తి స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించనున్నాం.

–కొచ్చర్ల రాజశేఖర్ బాబు, విద్యుత్ ఏడీఈ, సత్తెనపల్లి

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు 350 మంది హాజరు

తెనాలిఅర్బన్: వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ టెక్నికల్ విద్యకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని చెప్పారు. కోర్సు పూర్తయ్యే నాటికి విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వీరికి చదువు పూర్తయిన తర్వాత సదరు సంస్థలు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమర్ బ్యాటరీస్, ఎన్ఏసీ టెక్స్‌టైల్స్, జోసిల్, ఐటీసీ, టీవీఎస్, బ్లూస్టార్, ఈక్విక్‌డైస్ తదితర సంస్థల ప్రతినిధులు ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్స్ టి ఇమ్మానుయేలు, ఎ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌లు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చిన్న వెంకటేశ్వర్లు

మిర్చి నగదు చెల్లించట్లేదని ఫిర్యాదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మిర్చి డబ్బులు చెల్లించకుండా మధ్యవర్తులు, వ్యాపారి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లాడుతూ క్రోసూరు మండలం విప్పర్ల గ్రామానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులు మిర్చి కొనుగోలు చేసి, ఓ వ్యాపారికి మార్చిలో అందజేశారని తెలిపారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన మిర్చిని మిర్చియార్డులో విక్రయించి డబ్బులు తీసుకున్నారని పేర్కొన్నారు. తమకు రూ.3 కోట్లు చెల్లించకుండా మధ్యవర్తులు, వ్యాపారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. డబ్బులు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు విషయమై అడిగితే దాడులు చేయిస్తున్నారని వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబును కలిసేందుకు సిద్ధమని తెలిపారు. డబ్బులు చెల్లించకపోతే సామూహిక ఆత్మహత్యలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు, అనంతరం డీపీఓలో ఫిర్యాదు అందించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. లింగంగుంట్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా కాచిగూడ నుంచి గుంటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి తెలుపురంగు చొక్కా, బ్లూరంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు

సత్తెనపల్లి: రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలు మినహా 95 శాతం సేవలు రోగులకు అందుతున్నాయన్నారు. ఓపీ విభాగం బాగా రద్దీగా ఉంటుందని, తాను పరిశీలించిన సమయంలో 350 మందికిపైగా రోగులు ఉన్నారన్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే వైద్య సేవలు బాగా మెరుగయ్యాయని చెప్పారు. స్కానింగ్, ల్యాబ్ పరీక్షలు బయటకు రాస్తున్నారని అప్పుడప్పుడు ఫిర్యాదులు వస్తున్నట్టు వివరించారు. ప్రధానంగా స్కానింగ్‌కు రేడియాలజిస్ట్ లేకపోవడం కొంత సమస్యగా ఉందని పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రైవేటు వైద్యశాలతో ఒప్పందం చేసుకునే యత్నం చేస్తున్నామని వివరించారు. ల్యాబ్ పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపించే అవసరం లేదని, అలా పంపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు వైద్యశాలలో లేని అత్యాధునిక యంత్రాలు ఏరియా వైద్యశాల ల్యాబ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అంతకుముందు గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావుకు, వైద్యులకు పలు సూచనలు చేశారు.



సుపరింటెండెంట్ లక్ష్మణరావు, వైద్యులకు సూచనలు చేస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ శామ్యూల్ రాజు

క్రోసూరు: వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, తూనికలు, కొలతలు, ధరలపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ టి.శామ్యూల్ రాజు చెప్పారు. గురువారం క్రోసూరులోని పలు దుకాణాలు, వ్యాపారల సంస్థలలో తూనికల శాఖ అధికారులు సత్తెనపల్లి ఎస్ఐ షేక్ సైదాతో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మూడు చికెన్ షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్రలు లేకపోవటం, తూకాల్లో తేడాలు ఉండటం గుర్తించి కేసులు పెట్టారు. రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనంలో కాటాకు ముద్రలేకపోవటంతోపాటు, ఆటోమొబైల్ షాపులో ప్యాకింగ్, కమోడిటీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్యాకింగ్ ఉండటాన్ని గుర్తించారు. అనంతరం పత్తి కొనుగోలు చేసే బ్రోకరేజి కార్యాలయంలో కాటా తేడాగా ఉండటాన్ని గుర్తించి కేసులు పెట్టినట్లు శామ్యూల్‌రాజు తెలియచేశారు. అనంతరం వినియోగదారులకు అవగాహన కల్పించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఎవరైనా 0863–2223202కు ఫోన్ చేసి మోసాలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

గణపవరం గ్రామంలో చోరీ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో గురువారం మరో చోరీ జరిగింది. గత నెల 24న రెండు ఇళ్లలో జరిగిన జంట చోరీలను ప్రజలు మరువకముందే మరో దొంగతనం వెలుగులోకొచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన మిరియాల రామకృష్ణ దంపతులు మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్ళారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్ళగా, బీరువా తలుపులు ధ్వంసం చేసి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దుండగులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి రంపపు బ్లేడుతో బీరువాను కట్ చేశారు. బీరువాలోని రూ.22 వేల నగదు, రెండు పట్టుచీరలు, విలువైన దుస్తులు దొంగిలించారు. బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.



గణపవరంలో దుండగులు ధ్వంసం చేసిన బీరువా

మట్టి వాసనల కథకుడు కాట్రగడ్డ దయానంద్

నగరంపాలెం: మధ్యతరగతి జీవితాలకు, రైతుల వెతలకు అద్దం పట్టే కథల రచయిత కాట్రగడ్డ దయానంద్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి – వి.వి.ఐ.టీ.. 30వ ప్రచురణ 'పండుటాకు– గుండ్లకమ్మ తీరాన' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, సభకు ప్రముఖ అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ పాపినేని శివశంకర్ గ్రంథాన్ని ఆవిష్కరించగా, ప్రథమ ప్రతిని విశిష్ట అతిథిగా హాజరైన విజయవాడ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తికి అందజేశారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలకుపైగా సాహిత్య సేద్యం చేస్తున్న కాట్రగడ్డ దయానంద్ అభినందనీయులని అన్నారు. మట్టి వాసనల కథకుడు అని కొనియాడారు. ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ పుస్తక సమీక్ష గావించగా, గౌరవ అతిథిగా వాసిరెడ్డి విద్యాసాగర్, ఆత్మీయ అతిథిగా వాసిరెడ్డి నవీన్ హాజరయ్యారు. సభలో కాట్రగడ్డ జయలక్ష్మి, చైతన్య, వసంత, కారుణ్య, నిహారిక, శాన్విక, వేదామృత, నిహారిక, ధృవ్ రామ్ పాల్గొన్నారు.



పండుటాకు- గుండ్లకమ్మ తీరాన కథా సంపుటి పుస్తకావిష్కరణ సభలో అతిథులు

ఫుట్‌బాల్ జిల్లా బాలికల జట్టు ఎంపిక



పెదకాకాని మండలం ఉప్పలపాడు జడ్పీస్కూల్‌లో జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ బాలికల జట్టుకు ఎంపికైన వారితో సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు

పెదకాకాని: రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచి ఫుట్‌బాల్ కప్ సాధించడమే లక్ష్యమని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ దుర్గాప్రసాద్ అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జిల్లా జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలో జిల్లా స్థాయిలో ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థినిలు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనపరచి బాలికలు 18 మందితో జిల్లా ఫుట్‌బాల్ జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేశారు. 11 మంది ప్లేయర్స్, ఏడుగురు ఎక్స్‌ట్రా ప్లేయర్స్ పాల్గొనే జట్టులో ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 15 మంది బాలికలు, సత్తెనపల్లి బాలికల పాఠశాల నుండి ఒకరు, హోలీఫ్యామిలీ స్కూల్ నుండి ఒకరు, గుంటూరు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ నుండి ఒకరు ఎంపికయ్యారు. ఈ జట్టు ఈనెల 6వ తేది నుండి రెండు రోజుల పాటు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ ద్వారా ఫుట్‌బాల్ కోచింగ్ ఇవ్వడంతో ఉప్పలపాడు పాఠశాల నుండి 15 మంది ఎంపికయ్యారని, శ్రమకు తగిన ఫలితం దక్కిందని పీఈటీ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైనేని నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

ఆర్డీఓ పి.శ్రీకర్



గుంటూరు వెస్ట్: గర్భస్థ లింగ నిర్ధారణలో స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాల్సిందేనని, అతిక్రమించే వారిని డొకాయ్ ఆపరేషన్స్ ద్వారా గుర్తించాలని ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు, మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలలో ఐఈసీ బోర్డులు పెట్టాలన్నారు. సమాజ హితం కోరి ప్రభుత్వం ఏర్పాటు చేసే నిబంధనలు పాటించడం సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, వైద్యులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4400, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవయ్య



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి రూరల్ మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఉన్నం బసవయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని ఉన్నం బసవయ్యకు అందజేశారు. బసవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేలా ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేమళ్ల సాంబశివరావు, నాయకులు నూతక్కి అమరయ్య, కురగంటి చిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రక్షణ కోసం హనుమాన్ చాలీసా



అనంతవరం(తాడికొండ): అమరావతి రాజధాని మహానగరం నిర్మాణంతో పాటు రాష్ట్ర సర్వోత్తముఖాభివృద్ధి లక్ష్యంతో తుళ్లూరు మండలం అనంతవరంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం నిర్వహించారు. జాతీయ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో కంచి కామకోటి శంకర మఠం పీఠాధిపతులు జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతీస్వామి ఆధ్వర్యంలో గీతా పారాయణం, అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం వైభవంగా నిర్వహించారు.

సంగీత పరీక్షలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సంగీత సంబంధిత పరీక్షలు దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం జరిగాయి. సర్టిఫికెట్ కోర్సునకు సంబంధించిన పరీక్షకు 150 మంది హాజరయ్యారు. వర్సిటీ అధికారులు పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి మాట్లాడుతూ 5వ తేదీ పేపర్–1, 6వ తేదీన పేపర్–2, 7వ తేదీ నుంచి 12 వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల కిందట శస్త్ర చికిత్స చేయించుకున్న గృహిణి చనుమోలు పద్మావతి పరీక్షకు హాజరయ్యారు.